కథ



# జన్మసంస్కారం

— భార్గవీరావు

కార్తీకమాసం... ఆకాశదీపాల్లా నక్షత్రాలు.. చల్లని చిరుగాలులు... తొలి సంధ్య చీకట్లు ఇంకా కరగలేదు. తూర్పు ఆకాశం రత్నగర్భలా వెలుతురు నింపుకుని సూర్యోదయానికి సిద్ధంగా ఉంది. పాల నురగల అంచుల్తో ఒడ్డును ఒరుసుకుని, స్వచ్ఛంగా, స్వేచ్ఛగా పారుతున్న పిల్ల కాలువ.... ఎక్కడో దూరంగా వినిపించే చిరుసవ్వడులు.

ఊరు నిద్ర లేవకముందే కాలువలో స్నానం చేసి, గట్టున కూర్చుని సంధ్య వార్చుకోవడం రామచంద్రశాస్త్రిగారికి ఎన్నో ఏళ్లుగా నిత్యకృత్యమై పోయింది. చల్లటి స్నానంతో ఒంటికి ఉత్తేజం, మనస్సుకి ఉత్సాహం నింపుకుని, అలా తడి బట్టలతోనే మంత్రాలు చెప్పుకుంటూ ఇంటికెళ్లి, దేవతార్చన చేసుకుంటారు. పెరట్లోని పూలతో పూజాకార్యక్రమం, తులసి అర్చన చేసుకుని, నైవేద్యానికి పెట్టిన పాలూ, పళ్లు తిని వ్యవహారంలో పడతారు. పారాయణగ్రంథాలతో కాలక్షేపంఊళ్లోవాళ్లకి మంచీ చెడ్డా చెప్తూఅప్పుడప్పుడూ పొలం వైపు కూడా వెళ్లొస్తారు.

"మీకెందుకు శాస్త్రిగారూ, మీ పొలం రెండెకరాలు కూడా లేదు. మా పాలేళ్లే చూసుకుంటారు. కష్టపడకుండా పంట మీ ఇంటికి చేర్పించే పూచీ నాదీ..." అని రామిరెడ్డి హామీ ఇచ్చాక, శాస్త్రిగారికి ఏ చింతా లేకుండా పొద్దు గడిచిపోతోంది.

ఆ రోజు, స్నానం కానిచ్చి, కాలువ ఒడ్డున ఇసక తిన్నె మీద కూర్చుని ప్రాణాయామం చేసుకున్నారు. గాయత్రీమంత్రం అనుకుంటుంటే కూతురు గాయత్రి గుర్తుకొచ్చింది. ఒక్కగా నొక్క కూతురు. భార్య చనిపోయాక తనే తల్లిలా సుకుమారంగా, అపురూపంగా పెంచుకున్నాడు. ఎందుకో ఆ అమ్మాయికి పల్లెటూరి సంప్రదాయాలు నచ్చక, అమెరికా నుండి వచ్చిన జానకమ్మగారి కొడుకుని ప్రేమించి, పెళ్లి చేయించుకుని, విదేశాల కెళ్లిపోయింది. ఎలా ఉందో ఏమో, ఇద్దరు పిల్లలతో... అనుకుంటే కళ్లు నీళ్లతో నిండిపోయాయి. మనస్సు కూడతీసుకుని వేదం అందుకున్నారు. మనసంతా దిగులు ఆవరించుకుంది.

"ఓం అగ్నిమీళే పురోహితం యజ్ఞస్య దేవ మృత్విజం హోతారం రత్నధాతమం"

మళ్లీ గాయత్రి జ్ఞాపకాలు అడ్డుపడి మంత్రం తడబడింది. అంతలో కొద్ది దూరం నుండి ఎవరో స్పష్టంగా మంత్రం చెప్పడం వినిపించింది.

"అగ్ని ఆయాహి వీతయే గృణానో హవ్యదాతయే నిహోతే సత్సి బర్హిషి"

ఆశ్చర్యంతో అటూ ఇటూ చూశారు. చీకట్లో కనిపించలేదు. మంత్రం అందుకున్నారు.

మళ్లీ అదే గొంతు...!

ఈ సారి పరీక్షగా చూశారు. ఎవరో కుర్రాడు... సన్నగా రివటలా...

"బాబూ, ఇలా రా" అని దగ్గరికి పిలిచారు శాస్త్రిగారు.

నవ్వుకుంటూ, హుషారుగా దగ్గరికి వచ్చి —"దండం పెడ్తున్నా పంతులూ" అన్నాడు కుర్రాడు.

"ఎవరు నాయనా?"

"నేనండీ... నానీని"

"నీకు ఈ వేదమంత్రాలు ఎలా వచ్చు?"

"మీరు చదువుతుంటే చాలాసార్లు విన్నాను"

విని నేర్చుకున్నాడా, ఎంతో శ్రద్ధగా గురువు ద్వారా నేర్చుకుంటే తప్పు ఒంటపట్టని వేదమంత్రాలు విని నేర్చుకున్నాడా —ఏ జన్మ సంస్కారమో అని మనస్సులోనే ఆశ్చర్యపోయి"ఎవరి తాలుకా?" అనడిగారు.

"కృష్ణా జిల్లా... గుడివాడ తాలూకా."

"అది కాదు బాబూ... నీ అమ్మా నాన్న..."

"నాకెవరూ లేరండీ... గాలికి తిరుగుతుంటాను. ఇక్కడ చెట్లకు కాసిన రేగుపళ్లు, నేరేడుపళ్లు, జాంకాయలూ కోసుకుని, ఊళ్లో స్కూలు పిల్లలకు అమ్ముతానండీ... నాలుగు డబ్బులు దొరికిన రోజు ఆచారి హోటల్లో భోంచేస్తాను. ఒక్కోసారి గుళ్లో పూజారి గారు పిలిచి ప్రసాదం పెడతారు. అదీ లేదంటే ఇదే కాలువలో కాసిని నీళ్లు ఎక్కువ తాగి కడుపు నింపుకుంటాను" చిద్విలాసంగా నవ్వుతూ చెప్తుంటే, శాస్త్రిగారికి ఆ కుర్రాడు భగవద్గీతను ఒంటబట్టించుకున్న అర్జునుడిలా కనిపించాడు.

ఒక్కసారి వినగానే వేదమంత్రాలనే వల్లించగల ఆ కుర్రాడి సామర్థ్యం శాస్త్రిగారిని కట్టిపడేసింది.

"నానీ, మా ఇంటికొస్తావా?" ఆప్యాయంగా పిలిచారు.

"ఎందుకు? ఏదేనా పని ఇస్తారా?"

"లేదు బాబూ, నీకు ఇంకా బాగా మంత్రాలూ, శ్లోకాలూ నేర్పిస్తాను."



## నివాళి

తెనుగుసేతలో సిద్ధహస్తురాలైన భార్గవీరావు పేరెన్నికగన్న కథకురాలు కూడా. మే 23న అకస్మాత్తుగా కన్నుమూసిన భార్గవీరావు పంపిన చిట్టచివరి కథ ఇది. ఈ కథ ప్రచురణలో ఉండగానే ఆమె దూరమవడం విషాదం. 'జన్మరహస్యం' అంటూ తన కథకు పేరు పెట్టడంలోనే భార్గవీరావు తాత్త్వికత, మనఃస్థితి వెల్లడి అవుతున్నాయి.

ఆ సారస్వతమూర్తికి ఆంధ్రప్రభ నివాళి.

—సం॥

"నేర్చుకుని ఏం చేయాలి?"

"నీకు జ్ఞానం, ఆత్మవిశ్వాసం వస్తాయి."

"వాటినేం చేసుకోవాలి?"

"ఏమైనా సాధించవచ్చు. అందరూ నిన్ను గౌరవిస్తారు."

"దాంతో నా కడుపు నిండుతుందా?"

"ఆ సంగతి నే చూసుకుంటాను... రా" అని అంగవస్త్రాన్ని భుజాన వేసుకుని, దాని పైన మడిబిందెను పెట్టుకుని, మరో చేత్తో నాని చేయి అందుకున్నారు శాస్త్రిగారు.

000

అలా శాస్త్రిగారింటికి చేరిన నానికి, వేదనారాయణ అని నామకరణం చేసుకున్నారు. అతను కారణజన్ముడనీ, దేవుడు తన కోసమే పంపించిన వరాల మూట అనీ మురిసిపోయారు.

నారాయణ రాకతో శాస్త్రిగారికి మళ్లీ వసంతం వచ్చింది. వారి ఆలోచనలన్నీ వాడి చుట్టే. ఎక్కడి వాడీ కుర్రాడు? గాలికి కొట్టుకుని వచ్చినట్టుగా తన దగ్గరికే ఎందుకు వచ్చి చేరాడు? కఠినమైన, అర్థం తెలియని సంస్కృతశ్లోకాలు అలవోకగా ఎలా నేర్చుకుంటున్నాడు? జన్మసంస్కారమా... జాతిసంస్కారమా? శాపవశాత్తూ ఇలకొచ్చిన గంధర్వుడా? ఇలా సాగేవి వారి ఆలోచనలు.

నారాయణకు ఒక్క నెలలోనే శాస్త్రి గారి నియమనిష్ఠలన్నీ చక్కగా అలవాటయ్యాయి. శుభ్రమైన బట్టలూ, కడుపు నిండా ఆరోగ్యకరమైన తిండి దొరకటంతో, ఆరు నెలల్లోనే నేవళంగా తయారయ్యాడు. దేనికీ ఎదురు చెప్పకుండా, వినయంగా, చురుకుగా అన్ని పనుల్లోనూ చేయందించేవాడు. వంటా, వార్పూ, మొక్కలకు నీళ్లు పొయ్యడం, దేవతార్చనకు అన్నీ ఒద్దికగా అమర్చటం చేస్తుంటే, శాస్త్రి గారికి అతడి పట్ల అభిమానం వెల్లువైంది.

"నాన్నగారూ, నాన్నగారూ" అంటూ వెంట తిరిగే నారాయణ దైవాంశసంభూతుడనీ, తన్ను పున్నామనరకం నుండి తప్పించడాని కొచ్చినవాడనీ శాస్త్రిగారికి నమ్మకం కుదిరింది. అప్పుడప్పుడూ ఈ అబ్బాయి కులం, గోత్రం ఏదో కనిపెట్టాలని అనిపించినా, నదిమూలం, ఋషిమూలం వెదక్కుడదని విరమించుకున్నారు. వీడి జ్ఞానం మాత్రం కాకతాళీయం కాదు. పూర్వజన్మదీ అని నిశ్చయించుకున్నారు.

000

అన్ని సందేహాల్నీ పక్కన పెట్టి, నారాయణకు ఉపనయనం చేశారు శాస్త్రోక్తంగా.

"నారాయణా, నీకు నా గోత్రంశ్రీవత్స గోత్రం ఇచ్చి ఉపనయనం చేశాను. ఇప్పుడు నీవు ద్విజుడివి. నాకు కొడుకులు లేరనీ, ఆ పున్నామనరకం నుండి నన్ను కాపాడటానికి ఆ స్వామి స్వయంగా నిన్ను నా వద్దకు పంపించాడు. నా వంశాన్ని నిలబెట్టేభారం నీదే. నియమనిష్ఠలతో జీవించు. ఆ పరమాత్మ అనుగ్రహం సంపాదించు. నాకు పెద్దగా ఆస్తిపాస్తులు లేవు. వ్యవసాయం చేసుకున్నా, పౌరోహిత్యం చేసుకున్నా, నీకు నేను సాయం చేస్తాను" అని దగ్గరకు తీసుకున్నారు.

నాలుగేళ్లలో శాస్త్రి గారి ఆదరణలో ఏపుగా, ఆరోగ్యంగా పెరిగాడు నారాయణ. నూనూగు మీసాల యౌవనంతో కనుముక్కుతీరుగా ఉన్న కుర్రాడిలో కొంత మందికి శాస్త్రి గారి పోలికలు కూడా కనిపించేవి. మాట తీరు, మంత్రోచ్చారణ మాత్రం అచ్చం శాస్త్రిగారివే!

ఆ రోజు శాస్త్రిగారికి ఎందుకో నలతగా అనిపించింది. ఉదయం లేవలేకపోయారు. ఒళ్లంతా నొప్పులతో జ్వరం వచ్చినట్టనిపించింది.

"నారాయణా, ఈ రోజు నేను కాలువ దగ్గరికి రాలేను. నువ్వు స్నానం చేసి, మరో బిందె మడినీళ్లు తెచ్చెయ్యి. ఇంట్లోనే స్నానం చేస్తాను. దేవతార్చన కూడా నీవే చేసెయ్యి. హారతిచ్చేటప్పుడు పిలు" అని కప్పుకుని పడుకున్నారు.

ఎందుకో ఎన్నడూ లేని, అర్థం కాని ఉత్సాహంతో అలాగేనని బయలుదేరాడు. బిందె భుజం మీద పెట్టుకుని, స్వేచ్ఛగా పక్షిలా ఎగురుకుంటూ కాలువ గట్టుకు చేరాడు. ఒక్క ఉదుటున నీట్లో దూకి చేపలా ఈదుకుంటూ స్నానం చేశాడు. ఎంత సేపు అలా నీళ్లలో ఉండిపోయాడో... సూర్యోదయం అయిపోయింది. గబుక్కున బిందె నింపుకుని గట్టు మీదికొచ్చాడు.

కొద్ది దూరంలో చెట్టు చాటు నుండి రెండు కళ్లు అతడి ఆచ్ఛాదన లేని గుండెల్ని, తడి బట్టలు ఒంటికి అతుకున్న అతడి యౌవనాన్ని తడిమాయి. నారాయణకు చక్కలిగింతలకు అర్థం తెలిసింది. ఆ రెండు కళ్లున్న అందమైన అమ్మాయి అప్సరలా కనిపించింది. అప్రయత్నంగా బిందెను కింద పెట్టి నాలుగడుగులు నడిచి దగ్గరకెళ్లాడు. కళ్లతోనే పలకరించి కౌగిలించుకున్నాడు. కాదనకుండా కౌగిలిలో ఒదిగిపోయింది. ఇసక తిన్నెల మీద నారాయణ ఒంటి తడి ఆరడానికి ఎంతో సేపు పట్టలేదు.

సిగ్గుతో పరిగెడుతున్న ఆ అమ్మాయి వెంట పరిగెత్తాడు నారాయణ, మంత్రముగ్ధుడిలా!

000

శాస్త్రిగారు, నారాయణ కోసం ఎదురుచూశారు, ఆందోళనగా... గంటా... రెండు గంటలూ... సాయంత్రం అయినా ఇంటికి రాలేదు నారాయణ.

కీడు శంకించింది పక్కింటి వెంకటాచారి కొడుకుని పంపించారు. ఇరుగూ, పొరుగూ, పాలేర్లూ, అందరూ నారాయణ కోసం వెదికారు. వెదికించారు. నీరసంగా శాస్త్రిగారు కూడా కాలవ దాకా వెళ్లారు.

"నారాయణా, నారాయణా!" శాస్త్రిగారి పిలుపు ప్రతిధ్వనించింది కానీ, నారాయణ గొంతు వినిపించలేదు.

రెండు రోజులు రామచంద్రశాస్త్రిగారు సంధ్య వార్చలేదు. అన్నం మెతుకు ముట్టలేదు.

జబ్బుతో మంచం పట్టిన శాస్త్రిగారిని అందరూ ఓదార్చారు. ఏ విషప్పురుగో కరచి ప్రాణం పోయి ఉండవచ్చనీ, నీళ్లలో కొట్టుకుపోయి వుంటాడనీ, లేకపోతే ఎక్కడికి పోతాడనీ, తలో మాటా అన్నారు. ఏదో ఆలోచనతో ఇంటి నుండి వెళ్లాలనుకుంటే చెప్పకుండా ఎందుకెళ్లాడనీ అనుకున్నారు.

అలా శాస్త్రిగారి నిరీక్షణకు నెలలు నిండాయి.

"ఎందుకయ్యా దిగులుపడతావు? నీకంతే ఋణానుబంధం" అని వెంకటాచారి వేదాంతం చెప్పాడు.

కానీ శాస్త్రి గారికి మాత్రం నారాయణ చనిపోయి ఉండడనీ, తప్పకుండా తిరిగి వస్తాడనీ, మనస్సు చెప్పేది. "నా వేదనారాయణుడు ఎక్కడున్నా చల్లగా చూడు తండ్రీ" అని కళ్ల నీళ్లతో పరమాత్ముడుకి మొరపెట్టుకున్నారు.

000

లంబాడీ తండాలో మల్లి, నానీ ఒకరిలో మరొకరు మమేకమై సంతోషంలో మునిగితేలారు.

"మల్లీ, ఎక్కడో గాలివాటున పెరిగిన నన్ను శాస్త్రిగారు పెంచి, వడుగు చేసి బ్రాహ్మణ్ని చేశానన్నారు. కానీ నీ ప్రేమ... ప్రేమ నన్ను మనిషిని చేసింది. ప్రేమ కంటే కులం, గోత్రం గొప్పవని నేననుకోను." అని పదే పదే అనేవాడు నాని.

మల్లి నాయన నాయక్, తల్లి ఎల్లి కూడా నానిని ఒప్పుకున్నారు. వారితో కలుపుకుని పని నేర్పించారు. నాని కూడా కష్టపడి పని నేర్చుకుని వారి చేతిలో పోసేవాడు.

వాళ్ల తిండి తిన్నాడు... తాగాడు!

వేదమంత్రాలు మరిచిపోయాడు. నిద్రలో, కలలో ఎప్పుడైనా శాస్త్రిగారి మంత్రాలు వినిపించి కలవరపెట్టేవి. వారి నమ్మకాన్ని వమ్ము చేశానన్న పశ్చాత్తాపం, మల్లి ప్రేమ ముందు కరిగిపోయేది.

అలా రెండేళ్లు తండాలో వాళ్లు ఎటు వెడితే అటు వెళ్లాడు. ఏం చేయమంటే అది చేశాడు.

కానీ మల్లిది చిలిపి స్వభావం. అందరితో సరసాలేడేది. అసూయతో నాని కట్టడి చేస్తే తప్పు లేదని వాదించేది. గొడ్డు మాంసం, తాటికల్లు ఆరగించుకున్న నాని, మల్లి చంచల స్వభావాన్ని అరిగించుకోలేకపోయాడు.

ఒక రోజు సాయంత్రం పని చేసి అలసిపోయి ఇంటికొచ్చే సమయానికి, బట్టలు సర్దుకుంటూ గోప్యా గుడిసె నుండి బయటకొస్తోంది మల్లి. నిలదీశాడుతప్పేముందని వాదించిన మల్లిని తిట్టి, కొట్టి మనసారా ఏడ్చాడు. "అవును మల్లీ, నీ తప్పు కాదు. నిన్ను నమ్ముకుని నా తండ్రి నేర్పిన సంస్కారాన్ని కాలదన్నుకుని వచ్చాను, నాదీ తప్పు!"

కోపంతో దూరంగా వెళ్లిపోయింది మల్లి.

రెండు రోజుల్లో నాని ఒంట్లోని శక్తిని ఎవరో లాగేసినట్టు నీరసపడిపోయాడు. జ్వరంతో ఒళ్లు పేలిపోయింది. మల్లి నాయన వచ్చి ఏదో పసరు పోసి, గొంగళి కప్పి ఎవరి పని మీద వాళ్లు వెళ్లిపోయారు.

ఆ రోజు కలలో శాస్త్రిగారు చదువుతున్న మంత్రాలు బలంగా, స్పష్టంగా వినిపించాయి. ఎలాగైనా ఒక్కసారి తండ్రిని చూసి, పశ్చాత్తాపంతో కాళ్లు కడగాలని మెల్లగా ఊరి దారి పట్టాడు.

000

మనోవ్యాధితో మంచం పట్టిన రామచంద్రశాస్త్రిగారు, కోలుకోలేక పోయారు.

ఏమయ్యాడు, నారాయణ? ఎలా ఉన్నాడు? ఎక్కడున్నాడు? నేను గుర్తు రాలేదా? అందరూ అనుకుంటున్నట్టు ఏ పామో కరచి చనిపోయాడా? అలా అయి వుండదు. అయితే ఎందుకు ఇంటికి రాలేదు? నేనేం తక్కువ చేశాను? నిద్రలో కలవరింతలు... మెలకువలో పలవరింతలు.

వార్ధక్యం ముంచుకొచ్చింది. జీవితం పైన ఆసక్తి తగ్గిపోయింది. కూతురు చూడటానికి వచ్చి నిజంగా బాధపడింది.

"నా దగ్గరకు వచ్చేయి నాన్నా! కళ్లలో పెట్టుకుని చూసుకుంటాను. కన్నకూతురి కంటే, నాలుగేళ్లు పెంచుకున్న ఆ కుర్రాడి మీద మమకారం ఎక్కువా?" అని పోట్లాడింది.

"ఎక్కడి కొడుకయ్యా? ఎవరో ఏమో... నీవు మోహం పెంచుకున్నావు. ఏ జాతి వాడో ఏమో ఆ గూటికే చేరిపోయి వుంటాడు. బాధ పడకు" అని నచ్చచెప్పాడు శ్రీనివాసాచారి.

"జన్మసంస్కారం అంత బలంగా ఉంటే వాడికి వేదమంత్రాలు ఒంటబట్టేవా? దేవతార్చన నేర్పిస్తే వచ్చే విద్య కాదే? నా మీద గౌరవంతోనే అన్నీ నేర్చుకున్నాడు. ఊహూఁ కానే కాదు. ఏ పూర్వ జన్మసంస్కారమో వాడిని నా దగ్గరకు చేర్చింది. కానీ ఏమైంది? ఉన్నట్టుండి అలా ఎలా మాయమైనట్టు? నేను పెంచిన వేదనారాయణుడు శాపవశాత్తు జన్మనెత్తిన దైవాంశసంభూతుడు, ఋషి... అందుకే అలా విముక్తి లభించి వెళ్లిపోయాడు..." ఇలా సాగేవి శాస్త్రిగారి ఆలోచనలు.

ఒక రోజు ఇంటికొచ్చిన వెంకటాచారి, "ఇలా ఎన్నాళ్లు ఎదురు చూస్తావు? నీ గోత్రం ఇచ్చి వడుగు చేశావు కదా? శాస్త్రోక్తంగా తద్దినం పెట్టు. అతని ఆత్మా సంతోషిస్తుంది. నీకూ తృప్తిగా ఉంటుంది" అని సలహా ఇచ్చాడు.

"పన్నెండేళ్లు వేచి చూడాలి కదా?"

"నీకంత ఆయుష్షు ఉందను కుంటున్నావా? చెయ్యాల్సిన పని చేసెయ్యి" అన్నాడు వెంకటాచారి.

"నాకు తలకొరివి పెట్టి, పున్నామనరకం నుండి రక్షిస్తాడనుకున్న వాడికి, నేను తద్దినం పెట్టాలా?" నచ్చచెప్పుకోవటానికి కొన్ని నెలలు పట్టింది.

పితృపక్షాలు వచ్చాయి. పితృదేవతలకు తర్పణం ఇచ్చి ఋణం తీర్చుకుంటూ, మనస్సు గట్టి చేసుకుని, వేదనారాయణకు తద్దినం పెట్టటానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

000

దారితప్పిన నాని... నారాయణ ఊరి దారి వెదుక్కుని రావటానికి మూడు రోజులు పట్టింది. రోగంతో నీరసించిపోయి, పశ్చాత్తాపంతో మనసు బరువెక్కిన నారాయణ, కాళ్లీడ్చుకుంటూ ఊరి కాలవ గట్టుకు వచ్చాడు.

"ఇక్కడే ఇక్కడే... నన్ను మా నాన్న తీసికెళ్లి జీవితాన్నిచ్చాడు. నేను ప్రేమే జీవితం అనుకున్నాను. నేను ప్రేమ మరో పార్శ్వాన్ని చూడలేదు. మా నాన్న నన్ను ప్రేమించాడు. దేవుణ్ని ప్రేమించినంతగా నన్నూ ప్రేమించాడు. కానీ మల్లి పట్ల నా ఆకర్షణ నాలో కామాన్ని రగిలించింది. కామం వేరూ, ప్రేమ వేరు అని తెలుసుకునే లోగా జీవితంలో ఎన్నో కోల్పోయాను. ఇప్పుడు నాన్నదారికి ఎలా క్షమాపణలు చెప్పాలి? నన్ను క్షమిస్తారా?" నీరసంగా కూలబడ్డాడు.

కుంపటిలో నిప్పు మండుతోంది. శాస్త్రి గారి మనస్సులా, కంచుగిన్నెలో వండిన అన్నంతో నువ్వులు కలిపి, మూడు ముద్దలు చేసి, ఆకు మీద పిండాలు తయారుచేశారు. అపసవ్యంగా వేసుకున్న జంధ్యాన్ని పట్టుకుని, వెంకటాచారి చెప్తున్న మంత్రాలు అంటున్నారు అస్పష్టంగా! దర్భ కట్టుకున్న వేలితో ఏదో తర్పణం వదులుతున్నారు.

అన్నం మెతుకులు నిప్పులో పడి, పొగ పైకి లేచింది. ఆ పొగల వెనక నుండి శాస్త్రిగారికి నారాయణ కనిపిస్తున్నాడు... అస్పష్టంగా..

"ఏవిటీ, నా నారాయణ... వేదనారాయణ తిరిగొచ్చాడా? అయ్యో నేను ఏం చేస్తున్నాను? అపచారం... తద్దినం పెడుతున్నానా?"

"నారాయణా నారాయణా!" అని ఎలుగెత్తి పిలిచారు శాస్త్రిగారు. వారి చేతిలోని ఉద్ధరిణ కింద పడిపోయింది. అమాంతంగా అలా ఒరిగిపోయారు.

నారాయణ పరిగెత్తుకురావాలనుకున్నాడు.

"నాన్నా!" అన్న పిలుపు గొంతులోనే ఆగిపోయింది.

కాకులు కావు కావుమంటుంటే తెల్లవారింది. చుట్టుపక్కల వారంతా శాస్త్రిగారి చుట్టూ మూగారు.

ఎక్కడో దూరంగా గీతాశ్లోకం వినిపించింది స్పష్టంగా.

"శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః॥"